కథానిక

# ఒక క్షణం ఖరీదెంత?

"మంజుశ్రీ"

కృష్ణమూర్తి మూడుసార్లు ఇంటర్ మీడియట్ తప్పాడు. పెద్ద ఆశ్చర్యపడాల్సిన సంగతేం కాదు. ఎందుకంటే వాడు ప్యాసవుతాడనుకొన్న జీవి ఎక్కడా లేదు ఒక్క వాళ్ళమ్మ తప్ప. ఆవిడకేం తెలుసు, ప్లీడరు రామ్మూర్తిగారింట్లో తెల్లగా అంట్లు తోమడం, మడిబట్టలు ఎండెయ్యటం, శుభ్రంగా పుల్ల కూడా కనపడకుండా కసవూడవటం తప్ప. అదే కృష్ణమూర్తికి సరిపడదంది. "ముండమోసి ఇంట్లోకూచుంటే కంచంలోకి కూడెట్టా వస్తుంది"అంటుంది వాళ్ళమ్మ. కృష్ణమూర్తికి అభిమానం ముంచుకొచ్చింది. మూడు నెల్లు పట్టుకున్న కాళ్ళు విడువకుండా కాలేజీలో ఉద్యోగం సంపాదించాడు: లేబరేటరీలో అటెండరు. ఆతర్వాత వాళ్ళమ్మను ప్లీడరుగారింట్లో ఉద్యోగానికి రాజీనామా పడెయ్యమన్నాడు. ఆవిడ చావనన్నా చస్తానుగాని ఆపని చేయలేనని నిష్కర్షగాచెప్పింది. కృష్ణమూర్తి మూడురోజులు మంచినీళ్ళయినా ముట్టుకోకుండా వోమూల పడుకొని మూలిగాడు. వాళ్ళమ్మ వినలేదు. దేశాలమీద పోతానన్నాడు కృష్ణమూర్తి; మళ్ళీ తిరిగి రానన్నాడు. పోతే పొమ్మంది వాళ్ళమ్మ. కృష్ణమూర్తి ఏడ్చాడు. మొత్తుకున్నాడు. వాళ్ళమ్మ ససేమిరా వీలుకాదంది. కృష్ణమూర్తి కళ్ళుతుడుచుకొని ఆవాళనుంచీ కాలేజీకి పోయిరావటం మొదలెట్టాడు.

తెలిసినవాళ్ళు కృష్ణమూర్తిని కృష్ణమూర్తీ అని ఎవరూ పిలవరు. కృష్ణమూర్తిని 'కవీ' అని పిలుస్తారు. కృష్ణమూర్తి 'ఫిలాసఫరు'కూడా. పెద్ద నిరాశావాది.

రామ్మూర్తిగారమ్మాయి 'కమల' కాలేజీలో చేరినప్పటినుంచీ, కృష్ణమూర్తి హృదయం ఆమెపై వ్యామోహంతో నిండిపోయింది, కృష్ణమూర్తి కమలను ప్రేమించాడని చెప్పడానికి వీలులేదు. కృష్ణమూర్తికి అది అసంభవం అని కూడా తెలుసు. కృష్ణమూర్తి కమలను ప్రేమించలేదు. కమల కృష్ణమూర్తికి కావాలి. అంతే.

కమల నవ్వితే కృష్ణమూర్తికి గలగలపారే సెలయేళ్లు గుర్తుకొస్తాయి. తెలుగుమేష్టారుగారు చెప్పిన పెద్దనగారి పద్యాలు గుర్తుకొస్తాయి, అరవిచ్చిన మల్లెమొగ్గలు మనస్సులో మెదుల్తాయి.

కృష్ణమూర్తికి కమల చిన్నప్పటినుంచీ తెలుసు. కాని కమల కాలేజీలో చేరినప్పటినుంచే కృష్ణమూర్తి హృదయం యిలాంటి విచిత్రానుభూతులతో నిండిపోయింది.

మొదటిరోజు ప్రాక్టికల్సు చేసుకోవటానికి వచ్చిన రోజున కమల కృష్ణమూర్తిని కమ్మగా తియ్యగా 'మూర్తీ'అని పిలిచింది. కృష్ణమూర్తి హృదయంనిండా సన్నజాజులు విరగపూచినై. నందివర్ధనాలు నవ్వేసినై. దగ్గరసా వెళ్ళి 'ఏమిటి?' అన్నాడు.

"ఇదేమిటో చూడు? పాయింట్ ఫైవ్ వేస్తే ఎక్కువవుతుంది, పాయంట్ ఫైవ్ తీస్తే తగ్గుతుంది. ఎట్లా చచ్చేది?"అంది, ముఖంమీద పడ్డ ముంగురులను పైకితోసుకుంటూ.

కృష్ణమూర్తి నవ్వుకుంటూ,జాగ్రత్తగా వెయిట్ తీసి పెట్టాడు, 'పాయింట్ నాట్ టు ఫైవ్'వేసి. కృష్ణమూర్తికి అప్పుడు ఇంటర్ మేడియట్ యూనివర్శిటీ ఫస్టున ప్యాసైనంత గర్వమొచ్చింది. చుట్టుప్రక్కల కుర్రాళ్లు కృష్ణమూర్తి మహాద్భాగ్యానికి చాలా అసూయపడ్డారు.

కాస్త దూరంనుంచి చూసిన కుర్ర ఫిజిక్సు లెక్చరర్ కిది ససేమిరా గిట్టలేదు. దగ్గరగా వచ్చి "ఏమిటోయ్"అన్నాడు. "కాదుసార్, బాలెన్సు సరిగా పని చేయటంలేదు, చూస్తున్నాను"అన్నాడు.

"అరే, ఇదేమిటోయ్ ఫోర్ సెప్సుతో వెయిట్ తీద్దామంటే రావటంలేదు. ఇంకో వెయిట్ బాక్సు తెచ్చివ్వు"అన్నాడు.

కమల మొహాన చిరునవ్వు చిందులుతొక్కింది. "సరే సార్"అని కృష్ణమూర్తి కదలిపోయాడు.

ఆనాటినుంచీ కృష్ణమూర్తి జీవితంలో నిర్వేదం పాటలు పాడింది. విషాదం ఏడ్చేసింది. లేబరేటరీ బయటకొచ్చి 'జగమేమాయా' పాట పాడుకున్నాడు. బైయాలజీ లేబరేటరీకి వంద గజాల దూరంలో క్రిమేషన్ గ్రౌండు, మండిపోయే శవాలు పీక్కుతినబడే శవాలు, పొగలు, కమురుకంపు, కాలిన బూడిద అవుపడుతూనేవుంటాయి. కృష్ణమూర్తి కాసేపలానే కూచొని, "ఏమిజీవితం" అని ప్రశ్నించుకున్నాడు, 'ఏమిలేదు' సమాధానం చెప్పుకున్నాడు. మనస్సులో మథనపడి మథనపడి లేచి లోపలికెళ్ళాడు ఫిజిక్సులెక్సరర్ యింకా వెయిట్ తీస్తూనేవున్నాడు. కృష్ణమూర్తి కదేమిటో అర్థం కాలేదు. తానుయిందాక కరెక్టుగా వెయిట్ తీసిచ్చిపోయాడుగదా ,యింకా యీ మొహం చూసేదేమిటి అనుకున్నాడు, దగ్గర కెళ్ళి "ఫిఫ్టీ పాయింట్ నాట్ టూ ఫైవ్ కరెక్టుసార్"అన్నాడు. "సరే లేవోయ్ నెంబర్ నైన్ బాలెన్సు సరిగా పని చేయలేదట చూడు పో" అన్నాడు కృష్ణమూర్తి లోపల చాలా మండిపోయాడు. నోరు నొక్కుకొని వెళ్ళిపోయాడు. కమల చిరునవ్వు ఆనవాలు గట్టకపోలేదు. ఎఱ్ఱగా బుఱ్ఱగా, బుష్కోటూ, ట్వీడ్ పాంటూ, ఫిజిక్సులెక్చరర్ కి పెళ్ళయిందా, కాలేదా కనుక్కోవాలి, అనుకున్నాడు. కృష్ణమూర్తి ఇంటికెళ్ళి పండుకొని రాత్రి కలలో కమలకు ఎక్సిపెరిమెంటు మొత్తం చేసివేసి రాసిపెట్టాడు.

మర్రోజునుంచీ ఫిజిక్సు లెక్చరర్ పనిపట్టాడు. ఆయన అవివాహితుడేనట. ఆ సంగతి తెలిసినప్పటినుంచీ కృష్ణమూర్తి మరీ ఏడ్చేశాడు. ప్రాక్టికల్ క్లాసులో అన్నీ తానే తీసుకపోయి తానేచేసి తానేరాసి పెట్టేవాడు కమలకు, ఫిజిక్సులెక్చరరు. ఇప్పుడు కమలకు కృష్ణమూర్తితో అసలు పనే లేదు—ఏపరేటస్ బాగులేదని చిర్రుబుర్రు లాడటం తప్ప. కృష్ణమూర్తి కలాంటప్పుడు బాగా కోపమొస్తుంది. తత్ఫలితంగా కిందిపెదవి అరంగుళం తెగుతుంది.

కృష్ణమూర్తి రాత్రి రెండుగంటలు కొట్టేదాకా నిద్రపోడు. పెంకుటింటి వరండాలో వోచిన్న గదివుంది. సినిమా సెకండ్ షో వదలగానే పడుకునేవాడు. అప్పటిదాకా లైటేసుకొని చదువుకుంటుండేవాడు. కిటికీ, కిటికీపక్కన్నే కుర్చీ; కుర్చీలో కృష్ణమూర్తీ, కృష్ణమూర్తి కెదురుగా వోపుస్తకాల షెల్ఫూ, దాన్నిండా రకరకాల పుస్తకాలూ కొద్దిమంది స్నేహితులకుతప్ప తెలీదు. కృష్ణమూర్తికి 'కీట్స్'న్నా, కీట్సు పొయెట్రీ అన్నా మహాభిమానం. తానుగూడా 'కీట్సం'త కావాలనని కృష్ణమూర్తి ఆకాంక్ష, 'కీట్సు' పొయెట్రీ అంతా నోటికొచ్చు అతగాడికి.

ఓరోజురాత్రి కృష్ణమూర్తి గదిలో కూచుని రాసుకుంటున్నాడు.

సెకండ్ షోసినిమా వదిలేసిన వెంటనే కృష్ణమూర్తి పండుకోబోతుంటే, బయటవీధిలోకమల మాటలు వినిపించినయ్. కృష్ణమూర్తి కిటికీదగ్గర కెళ్ళి వీధిలోకి చూశాడు. 'కమల' పక్కన్నే ఫిజిక్సు లెక్చరర్ 'మధురమోహన్' ఇద్దరూ సెకండ్ షో చూసివస్తున్నారు కాబోలు. బయట వెన్నెట్లో వాళ్ళిద్దరినీ అలా చూసి కృష్ణమూర్తి గాఢంగా నిట్టూర్చాడు. వికసించిన తెల్లకలువలా వుంది కమల. రెండు జడలూ, పెదవులకు లిప్స్టిక్ స్లిప్పర్సూ, వయ్యారంగా నడుస్తూంది.

రామ్మూర్తిగారితోటి యీ సంగతి తెలియ చేయాలనుకున్నాడు కృష్ణమూర్తి. పండుకొని నిద్రపోయాడు. ఆ రాత్రి వో చక్కటి కామీ—ట్రాజెడీ, (గ్రిమ్మిక్చర్) కలవచ్చిందతనికి——

కాలేజీలో లేబరేటరీలో ఎక్సిపెరమెంటు చేస్తున్నది కమల. ఇంకెవరూలేరు అప్పుడు వున్నట్టుండి 'కమల' పమిటెకొంగు స్టవుమీదపడి మండిపోయింది. కృష్ణమూర్తి వెంటనేపోయి (ప్రాణాలకు తెగించి) నలిప్పారేశాడు. కృష్ణమూర్తి కౌగిలిలో ముడుచుకపోయింది కమల. ఇంతలోకే రాక్షసు డొచ్చినట్లుగా మోహన్ వచ్చి కమలను లాగేశాడు. కమల మోహన్ కౌగిట్లో యిమిడిపోయింది. కృష్ణమూర్తి ఇక వేదనను భరించలేక కాల్సియం క్లోరైడ్ వాసన చూద్దామని మూత తీస్తూ తీస్తూ అమ్మా అని అరిచాడు.

లైటు వెలగటం, అమ్మ వచ్చి గుండెలు నిమరటం, యివన్నీ జరిగిపోయినయ్...

అందరూ ప్రాక్టికల్సు చేసుకొని వెళ్ళిపోయినా కమలమాత్రం, చివరదాకా మిగిలే వుంటుంది. మధురమోహన్ అందరూ ఎలా చేసుకున్నా సరే కమల దగ్గర హాజరుగా వుండేవాడు.

ఓరోజు ప్రాక్టికల్స్ అయిపోయి, అందరూ యింటికెళ్ళి పోయిన తర్వాత రెండు బీకర్లిచ్చి మధురమోహన్, కృష్ణమూర్తిని కాఫీ తీసుక రమ్మన్నాడు.

కృష్ణమూర్తి యేడుస్తూ కాఫీ తీసుకొచ్చి చూసి చలించిపోయాడు. 'మధురమోహన్' కమలని ముద్దెట్టుకుంటున్నాడు. కృష్ణమూర్తి మాట్లాడకుండా కాఫీ తీసుకెళ్ళి అక్కడ పెట్టాడు. మధురమోహన్ మండిపోయాడు కమలకు కళ్ళనీళ్ళ పర్యంతమైంది. కృష్ణమూర్తి బయటకొచ్చి పని చూసుకుంటుంటే మధురమోహన్ లోపలనుండి తనను తిట్టటం విన్నాడు. "వెధవ, రాస్కెల్, సిగ్గులేదు, బుద్ధిలేదు." కృష్ణమూర్తి సగం చచ్చిపోయాడు. మధురమోహన్‌మీద మండిపడ్డాడు. ఆరోజు కృష్ణమూర్తికి భోజనం రుచించలేదు. శరత్ బాబును చదువుకుంటుంటే అమ్మొచ్చి దగ్గరకూచుంది. "ఏమిటిరా, యింకా వొకటే చదువుతుంటావ్," అని అడిగింది అమ్మ.

"ఏదో చదువుకుంటానులే నీకెందుకు పో," అన్నాడు కృష్ణమూర్తి.

"ఎక్కువసేపు చదువుకుంటే ఆరోగ్యం చెడిపోతుంది." అంది అమ్మ.

"పోనీలే" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమిట్రా నాయనా, బాధ, ఏదో అరవై రూకలు తెచ్చుకుంటున్నావు. మనిషిలాగా బ్రతుకుతున్నావు. ఇంకేమిటి బాధ," అంది అమ్మ.

"నాబొంద, నాదీవో బ్రతుకేనా, నేనేంచేస్తే మటుకేం ప్రయోజనం. ఏదో తింటున్నాంకదా, ఇంకా రామ్మూర్తి గారింట్లో పాచిపని చేయటం ఏం బాగుందమ్మా, మాటకో నా మనసులో సగం బాధ వదుల్తుంది" అన్నాడు కృష్ణమూర్తి.

"రామ్మూర్తిగారు మనను బ్రతికించారు. బ్రతికినంతకాలం వూరికే పనిచేసినా మనరుణం తీరదు నాయనా" అంది అమ్మ.

"ఏం రుణం, నెలకైదు రూపాయలు నీకు రుణం," అన్నాడు కృష్ణమూర్తి.

అమ్మ చెప్పింది.

"నువ్వెక్కడ పుట్టావో తెలుసా? రామూర్తి గారి నడిమింట్లో పడమరమూల కుక్కిమంచంపైన పుట్టావు, అవాళ వారింట్లో చోటు దొరక్కపోతే, నువ్వూ నేనూ, యిద్దరం చచ్చేవాళ్ళం. మీనాయన బహు దుర్మార్గుడు. మొదలు మొదలంతా బాగనే వుండేవాడు. ఐదారేళ్ళు కాపరం చేసిన తర్వాత, ఎవరితోటో సంబంధం పెట్టుకున్నాడు. పేకాటా, తాగుడూ, అలవాటయినయ్. నా ప్రాణం తీసేవాడు; చెయ్యి చేసుకొని, ఇల్లూ ఒల్లూ హూనం చేసుకొని, క్షయరోగం తెచ్చుకున్నాడు. అంతకుముందు యిద్దరు పిల్లలు పుట్టిపోయారు. నీవు యింకా రెండు జాములకు భూమ్మీద పడతావనగా, వుగ్రనరసింహ రూపంతోటి తాగి నన్ను కొట్టటానికొచ్చాడు. బజారున పడిఏడుస్తుంటే, లేవలేనిదాన్నాయె, పడితే యిద్దరం చచ్చేవాళ్లమే రామ్మూర్తిగారు, మహానుభావుడిలా కనపడి.యింట్లో ఆశ్రయమిచ్చారు.ఆరాత్రినొప్పులు పడుతుంటే మంత్రసాన్ని పిలిపించి, నానా అవస్థలు పడ్డారు. పాపం, అమ్మగారో శ్రీమహాలక్ష్మి. తరువాత మీనాన్న లెంపవేసుకొని రామ్మూర్తి గారి కాళ్ళమీదపడితే, డబ్బులిచ్చి మదనపల్లి పంపించారు. ఆయనక్కడే చచ్చాడు. తరువాత తరువాత, ఆరోగం నీకు రాకుండా వుండటానికని, ఆయన సామానంతా, అవతల పారేయమనిచెప్పి, పాపం పుణ్యాత్ముడు, కంట్లో పెట్టుకొని కాపాడారు. నీవు చదువుకుంటుంటే ఎంత సాయం చేశారు. అయినా సంసారులకు పనిచేసుకుంటే ఏం తప్పు, చెప్పు అయినా నన్నువాళ్ళు పనిమనిషిలాగా చూస్తూన్నారా ఏమిటి," అంది అమ్మ.

కృష్ణమూర్తి వణికిపోయాడు. అమ్మో క్షయ వ్యాధే - తనకు రాదుగదా? తాతతండ్రుల కా వ్యాధి వుంటే వస్తుందంటారు. కృష్ణమూర్తికి ఏడుపొచ్చింది. అమ్మ వెళ్ళిపోయిం తర్వాత తలగడ దిండంతా తడిసిపొయ్యేటంత యేడుపొచ్చింది. జీవితంలో సుఖమనేమాట ఎరగకుండా కలల్లో బతికి, కలలు రాసుకొని, కలగా జీవితం గడిపి, ఇరవై ఆరేళ్ళప్పుడు చచ్చిపోయాడు కీట్సు. క్షయ వ్యాధితోటే అతడుకూడా చచ్చింది. తనక్కూడా ఆ వ్యాధి రాదుకదా, తానుకూడా కీట్సులాగా

ఎవరినో ప్రేమించి, ప్రేమను పొందలేక గీతాలు రాసుకొని గుండెలను చీల్చి కావ్యాలను రాసుకొని చచ్చిపోడు గదా? కృష్ణమూర్తికారాత్రంతా విచిత్రమైన కలలొచ్చినయ్. నిద్రలేదు.

ప్రొద్దుటేలేచి అప్రయత్నంగా, తనకు తెలీకుండానే రామ్మూర్తిగారి వీధిలో నడచిపోతున్నాడు. మార్కెట్టుకు వెళ్ళాలంటే రామ్మూర్తిగారి వీధిలోంచి పోవాలసిన పనేలేదు కృష్ణమూర్తికి. కాని ఎందుకో అలా వెళ్ళాడు, పొద్దున్నే చలిగాలి కొద్దిగా బాధపెడుతున్నది. కమల బయట వాకిట పంపుదగ్గర నీళ్ళుపట్టుకుపోతున్నది. గాలికి కమల ముంగురులు టపటప కొట్టుకుంటున్నాయి. నీళ్ళతొణికి వొకపక్కభాగం చీరంతా తడిసిపోయింది. ఆ వయ్యారం, ఆ ఠీవి చూస్తుంటే కృష్ణమూర్తికి ఏమిటో అనిపించింది. కమల కృష్ణమూర్తివైపు చూసి ముఖం మాడ్చుకుంది. గబగబ యింట్లోకి పోయింది. రామ్మూర్తిగారు వీధిలో వెళ్ళిపోయే కృష్ణమూర్తిని పిలిచాడు. కృష్ణమూర్తి బిక్కుబిక్కుమంటూ పోయి ముందు నిలబడి "నమస్కారమండీ" అన్నాడు.

"వెధవ్వేషాలు వేస్తున్నావట. వొళ్ళు పగులుతుంది. వెకిలివేషాలు వేస్తావుట, పిచ్చిపిచ్చిగా చూస్తావుట, ఆయన చెప్పాడు, మోహన్‌గారు. ఏమనుకుంటున్నావ్. మూడురోజుల్లో వూడగొట్టించేస్తా. మీ అమ్మమొహం చూసి వూరుకుంటున్నాను. బుద్ధిగలిగి వుండు" అన్నారు.

కృష్ణమూర్తి ఏం మాట్లాడలేక పోయాడు. ఆ నిందావాక్యాలు హృదయాన్ని కదల్చివేశాయి. రామ్మూర్తిగారు యింట్లోకి వెళ్ళిపోయారు. తల వంచుకొని హృదయభారంతో వీధిమలుపు తిరగగానే కళ్ళు తుడుచుకున్నాడు కృష్ణమూర్తి.

తన అసహాయతను ఆధారంగా తీసుకొని లోకమంతా తనను ఏడిపిస్తున్నది. అయినా మరి తాను కమల గురించి మోజుపడట మేమిటి? అని ప్రశ్నించుకున్నాడు కృష్ణమూర్తి. మోజుపడట మేముంది యిందులో. కంటికందంగా వుంటుంది కాబట్టి నాలుగుమాట్లు చూద్దామనుకుంటున్నాడు.

కృష్ణమూర్తికి ఆలోచించటం చేతనైనప్పటి నుంచీ వొక్కటే ప్రశ్నను గురించి ఆలోచిస్తున్నాడు. మనుష్యుల్లో అమానుషత్వం ఎందుకింత ప్రబలిందనే, అతడి ఆలోచన. ఇంటికెళ్ళి ఏదో రాసుకున్నాడు.

కాలేజీకెళ్ళి పనిచూసుకొని మధ్యాహ్నం లీజర్‌లో గరల్స్‌రూములో కూచొని చదువుకుంటున్నాడు. అన్ని రూముల్లో గోలగోలగా వుంటుంది. అందుకని కూచొని శాంతిగా చదువుకుంటూండగా ఆవాళ ఎందుకో కమల అరగంట ముందొచ్చింది.

తనను చూడగానే "బుద్ధిలేదూ? ప్రిన్సిపాల్‌కి రిపోర్టుచేయాలా ఏమిటి?" అంది.

కృష్ణమూర్తికి బాగా కోపమొచ్చింది.

"అబ్బే ... అంతదాకా ఎందుకు, మధుర మోహన్‌తో రిపోర్టుచెయ్యి" అన్నాడు.

కమల మండిపోయింది. "రాస్కెల్, బ్రూట్, రోగ్, ఫూల్" అంటున్నది. కృష్ణమూర్తి తల వంచుకొని యివతలకొచ్చేశాడు.

ఆ సాయంత్రం మధురమోహన్ ఏపరేటస్ రూమ్‌లోకి కృష్ణమూర్తిని చాటుగా పిలిచాడు.

"బుద్ధికలిగి వుంటావా ఉండు లేకపోతే ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చేస్తాను"

"ఏం చేసానండీ?' అన్నాడు కష్ణమూర్తి.

"వెకిలివేషాలు వేస్తావేం?"

"ఏం చేసాను?"

"కమలంటే అంత పడిచస్తావేం?"

"నేనా?"

"బ్రూట్! నైట్రిక్ యాసిడ్ గొంతులో పోస్తాను. దెబ్బతో చస్తావు. జాగ్రత్త" అన్నాడు మోహన్.

"హద్దుమీరుతున్నారు."

మోహన్ మండిపోయాడు.

కృష్ణమూర్తి అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

బైయాలజీ లేబరేటరీ మెట్లమీద కూచున్నాడు పోయి. దూరంగా ఏదో శవం మండిపోతున్నది.

కృష్ణమూర్తి కళ్లుతుడుచుకున్నాడు. తన చేతిలోకి ఏదైనా పిస్టలిస్తే యీ మనుషుల్ని కాల్చిచంపేవాడే. లేకపోతే తానన్నా కాల్చుకొని చచ్చేవాడు. తననింతగా బాధపెట్టే లోకాన్ని తానేంచేసినా పాపంలేదు. కాని తానేంచేయలేదు. అదే తన బాధ అనుకున్నాడు కృష్ణమూర్తి.

తరువాత లేచి మళ్ళీ వెళ్ళాడు. కమలదగ్గరనిల్చొని ఎక్స్‌పెరిమెంటు చేస్తున్నాడు మధుర మోహన్.

కృష్ణమూర్తి మోహన్‌దగ్గరకెళ్ళి "యింటికెళ్లుతున్నా"నన్నాడు.

"ఆ ఏపరేటస్ తెచ్చిచ్చి ఏడువు పో" అన్నాడు మోహన్. కృష్ణమూర్తి యివ్వకుండానే వెళ్ళిపోయాడు. మర్రోజు ప్రొద్దుట కాలేజీ అంతా గోలపుట్టిపోయింది. ఎవరో వెధవలు, బోర్డుమీద "ఫిజిక్సు మేష్టారూ,కమలాదేవిగారల ప్రణయ విలాసాలు" అని హెడ్డింగుపెట్టి ఫిజిక్సు మేష్టారుగారికి కమల వ్రాసిన "ప్రేమలేఖ" నకలు ముత్యాల కోవలో తీర్చిదిద్ది వ్రాసిపెట్టి పోయారట. కమల చాటుగా భోరున యేడ్చింది. మోహన్ నిప్పు తొక్కిన కోతిలాగా అయినాడు. వాళ్ళిద్దరికీ కృష్ణమూర్తిమీదనే అనుమానం.

ప్రిన్సిపాలు మోహన్‌ని చాటుగాపిలచి "ఏవిటీ ఖర్మ" అన్నాడు. కృష్ణమూర్తే చేస్తుంటాడని మోహన్ అన్నాడు. ప్రిన్సిపాల్ కృష్ణమూర్తిని పిలిచి తలవాచేటట్లు చీవాట్లుపెట్టాడు

కృష్ణమూర్తి పాడుముండా వుద్యోగం వూడి పోతేవూడె, మోహన్‌కూ, కమలకూ శాస్తిచేయాలనుకున్నాడు. అడుగడుక్కూ అవమానమే. జీవితంలో ఏ విషయంలో చూసినా తనని బాధే వరిస్తున్నది. తనీ బాధపడలేదు. తనకు చదువూలేదు, డబ్బూ లేదు, అందమూ లేదు, గౌరవమూ లేదు.

కృష్ణమూర్తి భారంగా అడుగువేస్తూ ఇంట్లోకి వెళ్ళేటప్పటికి అమ్మ ఏడుస్తూకూచునుంది. కృష్ణమూర్తిని చూసి యింకబండెడు శాపనార్థాలు పెట్టింది. "కొప్పుడి పనికి రావద్దన్నారట" అంటున్నది. కృష్ణమూర్తికి మరీ కోపమొచ్చింది.

మర్రోజుప్రొద్దున్నే ప్రాక్టికల్ క్లాసుకెళ్ళి మోహన్ కెదురుగా నిలబడి రెండు చేతులూ జోడించి "నమస్కారంసార్" అన్నాడు.

ఏం...అన్నాడు మోహన్.

"ఏంలేదుసార్... రేపటి ఎక్స్‌పెరిమెంట్స్ ఏమిటో చెబితే, ఏపరేటస్ సరి చూసుకుంటాను"

"బుద్ధొచ్చినట్టుంది."

"అవునండీ"

"ఇలాంటి పిచ్చివేషాలు వెయ్యవుకదా."

"ఎబ్బే... నాపనే నాకు. దయుంచండి."

"బ్రూట్! అంత మిడిసిపడకూడదు. వెళ్ళు."

కృష్ణమూర్తి తలవంచుకొని వెళ్ళిపోయాడు.

మోహన్ పిలిచి, క్లాసైపోయేవేళకు, కాఫీ పట్టుకరమ్మని చెప్పాడు.

కృష్ణమూర్తి తలవూపి వెళ్ళిపోయాడు.

పదిగంటలు కాగానే, కాఫీపట్టుకొచ్చిచ్చాడు కృష్ణమూర్తి.

"నీవెళ్ళి నీపని చూసుకోపో." అన్నాడు మోహన్.

"ఒకమాట మనవిచేయాల్సుంది."

"ఏమిటోయ్."

"ప్రిన్సిపాలుగారు, ఈవాళ కాలేజీకి రాలేదు. తెలుసుగా, మిమ్ములను యింటికి రమ్మన్నారట."

"ఎవరు చెప్పారు?"

"జవాను"

"ఎప్పుడు?"

"వెంటనే అర్జంటుగా రమ్మన్నారట."

"సరే, నేవెళ్తున్నాను. వాళ్ళందరూ వెళ్ళిపోయింతర్వాత తాళమేసి, ఆఫీసులో యిచ్చివెళ్లు".

"సరేనండి."

మోహన్ వెళ్ళిపోయాడు.

కమల స్లిప్పర్స్ తొడుక్కుని, పుస్తకాలు సర్దుకుంటున్నది. ఏదుస్తూ చేస్తున్న స్టూడెంట్సు ఒకరో ఇద్దరో మోహన్ వెనకనే వెళ్ళిపోయారు.

కమల వెళ్ళిపోబోతుంటే "కమలా" అన్నాడు కృష్ణమూర్తి.

"ఒళ్ళు పెట్లుతుంది. ఏం..." అంది కమల.

"ప్రేమిస్తున్నాను."

"ఏడవలేకపోయేవ్ లే దార్లో."

"లేవను."

"నీ తాత లేస్తాడు."

కృష్ణమూర్తి సహించలేకపోయాడు. హృదయంలో కోపం అనలంగా మండిపోతున్నది. తటాలున కమలను కౌగలించుకున్నాడు.

కమల కొయ్యబారి పోయింది. అతడింత సాహసం చేస్తాడని అనుకోలేదు. నోటమాట పెగలి రాలేదు, అతడు ఆమె జెడా, మెడ స్పృశించాడు.

కమల పారిపోయింది.

కృష్ణమూర్తి విజయగర్వంతో ఇంటివేపు నడుస్తున్నాడు.

★